# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-10-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి 57 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే లైన్ ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.**
2. **రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన ప్రతి ఒక్కరి సాయం అందేలా చూడాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**
3. **తెలంగాణలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమిస్తున్నట్లు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు.**
4. **ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాలనా వ్యవహారాల్లో కృత్రిమ మేధ సాంకేతికతను వినియోగించుకోనున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.**
5. **రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలికవసతులను కల్పనకు ప్రభుత్వం 52 కోట్లు విడుదల చేసిందని ఆంధ్రప్రదేశ్ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి 57 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే లైన్ ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన నిన్న ఢిల్లీలో కేంద్ర మంత్రి వర్గం సమావేశమైంది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కేంద్ర మంత్రి పాత్రికేయులకు వివరించారు.అమరావతి మీదుగా ఎర్రుపాలెం-నంబూరు మధ్య కొత్త రైలు మార్గాన్ని నిర్మిస్తామని కేంద్ర మంత్రి వివరిస్తూ..

వాయిస్ (30 సెకన్లు)

అలాగే బీహార్‌లో 4 వేల 453 కోట్ల రూపాయలతో రైల్వే లైను డబ్లింగ్ పనులకు, అంతరిక్ష రంగంలో వచ్చే అంకుర పరిశ్రమల కోసం వెయ్యి కోట్ల రూపాయల 'వెంచర్ క్యాపిటల్ ఫండ్' ఏర్పాటు చేయడానికి కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

-------------------------

రాష్ట్ర రాజధాని అమరావతికి కొత్త రైల్వే లైన్ ఏర్పాటుకి కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపిన క్రమంలో

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపారు. గుంటూరు, విజయవాడ నగరాలను మీదుగా రాజధాని రైల్వే లైన్ వెళుతుందని దీని ద్వారా దేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానులకు అమరావతితో అనుసంధానం ఏర్పడుతుందని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

వాయిస్ ( 30 సెకన్లు)

అమరావతికి కొత్త రైల్వే లైన్ ఏర్పాటుపై కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్ ( 30 సెకన్లు)

-----------------------------

రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన ప్రతి ఒక్కరికి సాయం అందేలా చూడాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ప్రజలకు అందించిన వరద సాయంపై అధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు.

-----------------------------

తెలంగాణలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసంమంత్రివర్గ ఉప సంఘాన్ని నియమిస్తున్నట్లు ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాదులోని రాష్ట్ర సచివాలయంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ముఖ్యమంత్రి నిన్న సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

-----------------------------

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 90 శాతం రైల్వేలైన్ల విద్యుదీకరణ జరిగిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో తెలంగాణ పార్లమెంట్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేని విధంగా దక్షిణ మధ్య రైల్వే బడ్జెట్‌ను పెంచి, రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నామన్నారు. వరంగల్‌లో 650 కోట్ల రూపాయలతో రైల్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 720 కోట్లతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పనులు చేస్తున్నామని, వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ఈ పనులు పూర్తి చేస్తామని వివరించారు. యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ రైలును పొడిగించాలని నిర్ణయం తీసుకున్నామని కేంద్రమంత్రి వివరించారు.

-----------------------------

తెలంగాణ పెట్టుబడులకు వ్యాపార భాగస్వామ్యాలకు గమ్యస్థానంగా నిలుస్తోందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు తెలిపారు. జర్మనీలోని రైన్‌ల్యాండ్‌కు చెందిన ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం హైదరాబాదులోని సచివాలయంలో మంత్రితో నిన్న సమావేశమైంది. ఫార్మా ఉత్పత్తులు, బయోటెక్నాలజీ, టీకాలు, వ్యవసాయం, ఆటోమొబైల్స్ వంటి విభాగాల్లో భాగస్వాములు కావడం, పెట్టుబడులు పెట్టే అవకాశాలపై మంత్రితో చర్చించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, తెలంగాణలో నూతన ఆవిష్కరణలు, ఆధునిక పరిశోధనలను ప్రోత్సహించే విధంగా ప్రపంచ స్థాయి వ్యవస్థను ఏర్పాటు చేయడంపై దృష్టి సారించామన్నారు. పెట్టుబడులను పెట్టేందుకు రైన్‌ల్యాండ్ బృందం ఆసక్తి కనబర్చిందని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాలనా వ్యవహారాల్లో వేగవంతమైన, మెరుగైన సేవలకు కృత్రిమ మేధ సాంకేతికతను వినియోగించుకోనున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్.. తెలిపారు. ముంబైలో ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్‌తో మంత్రి నిన్న సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా అమరావతిలో ఏర్పాటు చేయనున్న కృత్రిమ మేధా విశ్వవిద్యాలయానికి తగిన సూచనలు ఇవ్వాల్సిందిగా కోరారు. అందుకు జెన్సన్ సానుకూలంగా స్పందించారని.. రానున్న రోజుల్లో ఏఐ సాంకేతికత ద్వారా అంతర్జాతీయంగా వచ్చే మార్పుల గురించి వివరించారని మంత్రి తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలికవసతులను కల్పించేందుకు ప్రభుత్వం 52 కోట్లు విడుదల చేసిందని ఆంధ్రప్రదేశ్ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, శౌచాలయాలను వెంటనే ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విజయవాడ, విశాఖ, తిరుపతి, గుంటూరు తదితర పట్టణ ప్రాంతాల్లో కొత్త అంగన్‌వాడీ కేంద్రాల మంజూరుకు కేంద్ర ప్రభుత్వాన్ని అనుమతి కోరతామని తెలిపారు. చిన్నారులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని మంత్రి అధికారులకి సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ముగ్గురు కొత్త న్యాయమూర్తులు నియమిస్తున్నట్లు న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలోనే న్యాయవాదులుగా సేవలందిస్తున్న కుంచం మహేశ్వరరావు, తూట చంద్ర ధనశేఖర్, చల్లా గుణరంజన్‌లను అదనపు జడ్జిలుగా నియామకానికి రాష్ట్రపతి ఆమోదం లభించిందని చెప్పారు. ఇటీవల సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫారసు చేయగా, రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిలతో చర్చించిన తర్వాత వీరిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో అదనపు జడ్జిలుగా నియమిస్తున్నట్లు కేంద్ర మంత్రి సామాజిక మాధ్యమం వేదికగా వెల్లడించారు.

---------------------------

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన 'దానా' తుపాన్ తీరం దాటిందని భారత వాతావరణ శాఖవెల్లడించింది. ఒడిశాలోని బిత్తర్‌కనిక, ధమ్రా మధ్య తీరం దాటిన తుపాన్ ఈ ఉదయానికి బలహీనపడనుందని తెలిపింది. తుపాన్ ప్రభావంతో ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించాలని అధికారులు రెండు రాష్ట్రాలకు సూచించారు. కోల్‌కతా, భువనేశ్వర్ విమానాశ్రయాలను మూసి వేశారు. రెండు రాష్ట్రాల్లో మొత్తం 400 రైళ్లను రద్దు చేశారు. అధికారులు తుపాను ప్రభావితమయ్యే ప్రాంతాలను నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రక్రియ చేపట్టారు.

కాగా.. దానా తుపాను ప్రభావం ఉభయతెలుగు రాష్ట్రాలపై లేదని వాతావరణ శాఖ తెలిపింది.

---------------------------

ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగంలో క్యాజువల్ న్యూస్ రీడర్ కమ్ ట్రాన్స్‌లేటర్, క్యాజువల్

న్యూస్ ఎడిటర్‌గా పనిచేసేందుకు అభ్యర్థులనుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రాంతీయ వార్తా విభాగాధిపతి శ్రీసాయి వెంపాటి ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ పరిసర ప్రాంతాల్లో నివసించే అర్హులైన అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆఫ్‌లైన్ విధానంలో వచ్చే నెల 5వ తేదీలోపు ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగానికి పంపించవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 9440674057 నెంబరును సంప్రదించవచ్చని వెల్లడించారు.

-----------------------------

తెలంగాణలో దీపావళి పండుగ సందర్భంగా సింగరేణి కార్మికులకు బోనస్‌ను ఈ రోజు జమచేస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో సింగరేణిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, కార్మికులకు బోనస్ కోసం 358 కోట్లను విడుదల చేయాలని సింగరేణి ముఖ్య కార్య నిర్వహణాధికారి ఎన్.బలరామ్‌ను ఆదేశించామని చెప్పారు.

========================